ప్రతి ఇంటికీ 24 గంటలు శుద్ధినీరు అందిస్తా

- రూ.58.2 కోట్లతో సమగ్ర తాగునీటి పథకానికి భూమిపూజ
- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


సమగ్ర సాగునీటి పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసి చైర్మన్ మల్లికార్జునరెడ్డి

కమలాపురం : పట్టణంలో ప్రతి ఇంటికీ 24 గంటలు శుద్ధినీరు అందిస్తామని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక అర్బన్ పీహెచ్‌సీ వద్ద ఏర్పాటు చేసిన సమగ్ర తాగు నీటి సరఫరా పథకానికి ఆర్టీసి చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డితో కలసి ఎమ్మెల్యే భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమలాపురం పట్టణ అభివృద్ధిలో భాగంగా ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి నాణ్యమైన శుద్ధి నీటిని అందించడం కోసం రూ.58.2 కోట్లతో ఒక బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. గతంలో డ్రైనేజీలోనే నీటి పైప్‌లైన్‌లు ఉండేవని, అందులో నీరు కలుషితం కావడంతో పాటు అవే నీరు కుళాయిలకు వచ్చేవన్నారు. దీంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతినేదన్నారు. ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన కమలాపురం పర్యటనలో భాగంగా ఈ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రస్తుతం కార్యాచరణ చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 4 ఈఎల్ఎస్ఆర్‌లు వస్తాయన్నారు. అలాగే ఈ పని పూర్తి కాగానే రూ.38 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. ఇప్పటికే రూ.36 కోట్లతో డ్రైన్స్ పూర్తి చేశామన్నారు. మరో రూ.14.5 కోట్లతో ఓపెన్ డ్రైన్స్, రూ.8 కోట్లతో స్ట్రాం వాటర్ డ్రైన్స్ నిర్మాణం చేపట్టామన్నారు. రూ.6.5 కోట్లతో రోడ్డు డివైడర్, బ్యూటిఫికేషన్ చేపడతామన్నారు. మరో నెల రోజుల్లో 50 పడకల ఆసుపత్రి ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే పాలిటెక్నిక్ కళాశాలను వినియోగంలోకి తీసుకువచ్చామన్నారు. త్వరలో ఆర్‌ఓబీ, బైపాస్ నిర్మాణాలను చేపడతామన్నారు. కమలాపురం పట్టణం కడప, ప్రొద్దుటూరుకు మధ్యలో జగనన్న ఇండస్ట్రియల్ హబ్‌కు అతి సమీపంలో ఉండటంతో ఈ పట్టణాన్ని అన్ని సౌకర్యాలతో మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కమలాపురం పట్టణం అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వంద కోట్ల నిధులు విడుదల చేయడం హర్షణీయం అన్నారు. కమలాపురం ప్రజల చిరకాల కోరిక ఆర్‌ఓబీ నిర్మాణానికి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అప్పట్లో రూ.33 కోట్లు మంజూరు చేశారన్నారు. అయితే అప్పట్లో నిర్మాణానికి నోచుకోలేదన్నారు. ప్రస్తుతం ఆయన తనయుడే తిరిగి ఆర్‌ఓబీ, బైపాస్ నిర్మాణానికి నిధులు విడుదల చేయడం హర్షణీయం అన్నారు. కమలాపురం నియోజకవర్గ అభివృద్ధి ఇన్ని వందల కోట్ల నిధులు విడుదల చేశారంటే ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ అండ్ హెల్త్ ఈఈ చెన్న కేశవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎంపీపీ గండి భారతి, మున్సిపల్ చైర్మన్ మార్పూరి మేరీ, మునిరెడ్డి, రఘురామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మహ్మద్ సాదిక్, గఫార్, మైసూరారెడ్డి, రామసుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, పి.సుబ్బారెడ్డి, ఆర్‌వీఎస్ఆర్ పాల్గొన్నారు.

గజమాలతో సత్కారం

సమగ్ర తాగునీటి సరఫరా పథకానికి భూమి పూజ చేయడానికి వచ్చిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి రాకను పురస్కరించుకుని మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాస రెడ్డి వైఎస్సార్ సీపీ జెండా రంగులతో కూడిన గజమాలతో సత్కరించారు. బాణా సంచా పేల్చుతూ స్వాగతం పలికారు. అనంతరం వారిని శాలువ కప్పి, పూలమాలలతో సన్మానించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అర్హులైన పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం కమలాపురం పట్టణంలోని 1వ వార్డు సచివాలయ పరిధిలోని పుట్లంపల్లె, యానాది కాలనీ, అరవింద్ నగర్, కృష్ణానగర్ తదితర కాలనీల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వారికి అందిస్తున్న పథకాలను, జరిగిన లబ్ధిని వివరించారు. రేషన్ కార్డులు, పింఛన్లు, రోడ్లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు కావాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. అలాగే దాదాపు రెండేళ్లుగా మంచానికే పరిమితమైన అడవి సుబ్బరాయుడుకు పింఛన్ మంజూరు చేయాలని వైద్యాధికారులను ఎమ్మెల్యే ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ ఒక్క కుటుంబం ఇబ్బంది పడకూడదని భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


పుట్లంపల్లెలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

అవినీతిని ప్రక్షాళన చేసేందుకే వలంటీర్ వ్యవస్థ

రాష్ట్రంలో గత టీడీపీ పాలనలో జరిగిన అవినీతిని ప్రక్షాళన చేసేందుకే వలంటీర్ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకు వచ్చారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ చలపతి ఆధ్వర్యంలో జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. కమలాపురం 1వ వార్డు సచివాలయంకు చెందిన సేవా వజ్ర అవార్డు పొందిన వెంకటరమణతో పాటు సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు పొందిన వలంటీర్లను ఆయన శాలువ కప్పి, బ్యాడ్జి, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో పూర్తిగా అవినీతి పాలన సాగిందన్నారు. ఆ అవినీతిని ప్రక్షాళన చేయడానికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చారన్నారు. అయితే మీకు సేవా గుణంతో పనిచేయాలని చెప్పే విధుల్లోకి తీసుకున్నారని, గౌరవ వేతనాన్ని రూ.8వేలకు పెంచాలని కూడా సీఎం నిర్ణయం తీసుకున్నారని కేవలం కరోనా కారణంగా, బడ్జెట్ సహకరించక పోవడంతోనే గౌరవ వేతనం పెంచలేక పోయారన్నారు. భవిష్యత్తులో మీకు గౌరవ వేతనాన్ని వేతనంగా మార్చవచ్చని, లేదా పర్మినెంట్‌గా చేసినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదన్నారు. ముఖ్యంగా మిమ్మల్ను చూడగానే అవ్వా తాతల ముఖాల్లో సంతోషం వెల్లివిరిస్తుందన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు లంచాలు, కమీషన్లు ఇచ్చిన వారికే అరకొర పథకాలు ఇచ్చేవారన్నారు. కానీ మన ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించే బాధ్యత కూడా జగనన్న మీకే అప్పగించారన్నారు. వేరే పార్టీ అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థ ఉంటుందో లేదోనని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మీరు సైనికుల్లాగా పని చేసి జగనన్నకు తిరిగి సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మండల స్పెషలాఫీసర్ నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, ఎంపీపీ భారతి, మున్సిపల్ చైర్మన్ మేరీ, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని అంబవరం పంచాయతీలోని చిటిమిటి చింతల గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలతో పాటు, వారికి సంక్షేమ పథకాలు వస్తున్నాయా లేదా అని తెలుసుకున్నారు. ప్రజలు ఏమైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకుని వస్తే వాటిని పరిష్కరిస్తామని ప్రజలకు ఆయన సూచించారు. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడిలేకుండా చేయాలని ప్రజలు ఆయనను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ తీసుకున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి మహిళ ఆర్థికంగా స్థిరపడాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. పట్టణంలోని నిరుపేదలకు దాదాపు మూడువేలకు పైగా ఇంటిస్థలాలు మంజూరు చేయించామన్నారు. గత పాలకులకంటే మిన్నగా పరిపాలన జరుగుతుందన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో రూ.10 కోట్లతో పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకుడు నాయక్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సచివాలయం, ఆర్బీకేల ప్రారంభం

మైలవరం మండలం వద్దిరాల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే, సచివాలయాలను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ పరిపాలన సౌలభ్యం కోసం ప్రజలు తమ సమస్యలను మండల కేంద్రానికి వెళ్లి పరిష్కరించుకోవలసిన అవసరం లేకుండా గ్రామాలలోనే సమస్యలను పరిష్కరించుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. అలాగే రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాల పంపిణీ చేయించడం కోసం ఆర్బీకేలను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం గ్రామ ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించడం కోసం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే ధన్నవాడ గ్రామానికి చెందిన ఎద్దుల ఎల్లమ్మకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయన స్వయంగా బాధితురాలి ఇంటికి వెళ్లి రూ.4లక్షల 80వేల చెక్కును అందజేశారు. అలాగే పెద్దముడియం మండలంలోని ఎస్.కొట్టాలపల్లి గ్రామంలోని రామాలయంలో నిర్వహించిన విగ్రహప్రతిష్ట కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్బన్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇన్‌ఫ్రాస్టక్చర్ చైర్మన్ వెంపలాలకు లీలావతి, జడ్పీటీసీ మహాలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధన్నవాడ మహేశ్వర రెడ్డి, చెన్నకేశవరెడ్డి, లక్షుమయ్య యాదవ్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గుర్విరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మండల ప్రత్యేకధికారి శ్రీనివాసులు, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సచివాలయ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

పులివెందుల : దెబ్బతిన్న అరటి తోటల రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించి నివేదిక అందించాలని ఉద్యాన శాఖ అధికారులకు తెలిపామన్నారు. దెబ్బతిన్న అరటి తోటలను ఉద్యాన, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి వెలమవారిపల్లె, వై.కొత్తపల్లె గ్రామాల్లో పరిశీలించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రాథమికంగా నియోకవర్గంలో 26 గ్రామాల్లో 1049 మంది రైతులకు చెందిన 957 హెక్టార్లలో అరటి పంట నష్టం జరిగిందని ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారణ కూడా చేపట్టారని తెలిపారు. నివేదిక వచ్చిన వెంటనే ప్రభుత్వానికి అందజేసి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఓఎస్డీ తెలిపారు.


దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు

రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేటి నుంచి విత్తన కాయలకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

తొండూరు : ఈనెల 25వ తేదీ నుంచి మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో వేరుశనగ విత్తనాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయని మండల వ్యవసాయాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

బుధవారం స్థానిక తొండూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కె6 వేరుశనగ విత్తన కాయల పంపిణీ చేస్తోందని.. కె6 కిలో వేరుశనగ విత్తన కాయలు రూ.93లు కాగా.. ప్రభుత్వ సబ్సిడీపోను రైతు వాటా కింద కిలో వేరుశనగ విత్తన కాయలకు రూ.55.80 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వచ్చేనెల 5వ తేదీనుంచి వేరుశనగ విత్తన కాయలను రైతులకు పంపిణీ చేస్తామన్నారు. వీటితోపాటు పచ్చిరొట్ట ఎరువు, జీలుగలు కూడా పంపిణీ చేయడం జరుగుతున్నారు. కావాల్సిన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

'దిశ'పై అవగాహన అవసరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహిళలు, యువతులు దిశ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, మెప్మా పీడీ సురేష్‌రెడ్డి తెలిపారు. యువజన సర్వీసులశాఖ ఆదేశాల మేరకు బుధవారం నగరంలోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో మహిళల అక్రమ రవాణా, దిశ యాప్, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దిశ చట్టం గురించి తెలుసుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. ఈ చట్టం ద్వారా మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. దిశ పోలీసు ఎస్ఐ లక్ష్మిదేవి, వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ సునీత మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఎన్ని చట్టాలు వచ్చినా చాలాదేశాల్లో మనుషుల అక్రమ రవాణా సాగుతూనే ఉందన్నారు. ఇటువంటి వాటి గురించి మహిళలు అవగాహన కలిగి జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ అధినేత ఇంతియాస్ అహ్మద్, మేనేజర్ సుబ్బరామిరెడ్డి, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

'నేడు గడప గడపకు మన ప్రభుత్వం'

వీరపునాయునిపల్లె : మండలంలోని యు.రాజుపాలెం సచివాలయ పరిధిలోని కదిరేపల్లె, తాటిమాకులపల్లె, యు.రాజుపాలెం గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. అలాగే గురువారం ఉదయం 10 గంటలకు వలంటీర్లకు నిర్వహించాల్సిన సన్మాన కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వలన రద్దయిందని ఈ విషయాన్ని అధికారులు, నాయకులు, కార్యకర్తలు గమనించాలని ఆయన కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు, యు.రాజుపాలెం సచివాలయ సిబ్బంది, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతంచేయాలని ఆయన కోరారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

చెన్నూరు : చెన్నూరులోని ఒకటో వార్డు మైనార్టీ కాలనీ బజారు వీధికి చెందిన షేక్ మహబూబ్‌బాషా అనారోగ్యం కారణంగా బుధవారం మృతి చెందారు. ఈ విషయాన్ని మండల కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎండీ వారిస్ వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్‌రెడ్డికి తెలియజేయగా ఆయన కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతుడి కుటుంబ సభ్యులకు దహన సంస్కారాల నిమిత్తం రూ.5000 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కమలాపురం నియోజకవర్గ మైనార్టీ కన్వీనర్ అన్వర్‌బాషా, 1వ సచివాలయ కన్వీనర్ అబ్దుల్‌రబ్, హస్రత్, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీ సీఈకి ఘన స్వాగతం

కడప కల్చరల్ : రాయలసీమ థర్మల్ విద్యుత్‌కేంద్రం (ఆర్టీపీపీ) నూతన సీఈగా బాధ్యతలు స్వీకరించిన టి.నాగరాజుకు మైనార్టీ సంఘ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం ఆయన కార్యాలయంలో కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రికల్ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ నాయకులు, సభ్యులు ఆయనకు పూల బొకేను అందజేసి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల వేతన సమస్యలను ఆయనకు వివరించారు. నూతన సీఈ స్పందిస్తూ పై సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామి ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం నేతలు ఖాజాపీర్, ఖాసిం, మగ్బూల్, అల్తాఫ్, హుసేన్, రఫ్, షేక్ షావలీ, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్‌లోని లోపాలను సవరించాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ బదిలీల్లోని సాంకేతిక లోపాన్ని సవరించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. ఈ విషయమై బుధవారం డీఈఓ రాఘవరెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు.

98-డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్ : 1998 డీఎస్సీ క్వాలిఫై అయ్యి సర్టిఫికెట్లు పరిశీలన పూర్తి అయిన అభ్యర్థులందరికీ ఉపాధ్యాయ ఉద్యోగాలను ఇవ్వాలని 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రమౌళి, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై బుధవారం టీచర్స్ ఎమ్మెల్సీ యంవీ. రామచంద్రారెడ్డిని కడపలో కలిసి సంబంధిత సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంబంధిత సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగాలు వచ్చేలా చూడాలని కోరారు.

నేత్రదానంతో చూపు పదిలం

పులివెందుల టౌన్ : వృద్ధురాలు మృతి చెందినా.. నేత్రదానం చేయడంవల్ల వారి చూపు పదిలంగా ఉంటుందని నేత్రనిధి సంస్థ అధ్యక్షుడు రాజు తెలిపారు. పులివెందుల పట్టణానికి చెందిన జి.రెడ్డమ్మ(92) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారులు, కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ నేత్రనిధి సంస్థ అధ్యక్షుడు రాజుకు సమాచారం అందించారు. వెంటనే ఆయన నేత్రనిధి సంస్థ సిబ్బందితో మృతురాలి ఇంటికి చేరుకుని మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి తరలించారు.

జూదరుల అరెస్టు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని తిప్పలూరు గ్రామంలో ఉన్న ఏకేఆర్ కల్యాణ మండపం సమీపంలోని కంపచెట్లలో పేకాట ఆడుతున్న 9 మంది జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.54,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రాబడిన సమాచారం మేరకు దాడులు చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

నేడు ఇప్పెంటకు ఎమ్మెల్యే రాక

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఇప్పెంట పంచాయతీకి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి వస్తున్నట్లు మండల కన్వీనర్ గూడ ప్రభాకర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పెంట ఎస్సీ, ఎస్టీ కాలనీ, వెంకట్రామ్‌పల్లె గ్రామాల్లో రామాలయాల కోసం భూమి పూజకు హాజరవుతున్నట్లు తెలిపారు. మండల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ


చిత్రలేఖనంపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా బుధవారం విద్యార్థులకు పొడుపు కథలు, నీతి కథలు బోధించారు. అలాగే విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు లైబ్రేరియన్ కృష్ణకిశోర్‌రెడ్డి స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత


పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేస్తున్న స్థానికులు, ఫారెస్ట్ సిబ్బంది

పులివెందుల టౌన్ : పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత మనందరిపై ఉందని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మహబూబ్‌బాషా తెలిపారు. బుధవారం స్థానిక రాణితోపు పార్కులో లైఫ్ కార్యక్రమంలో భాగంగా లైఫ్‌స్టైల్ ఫర్ లివింగ్ ప్రోగ్రాం నిర్వహించి ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత వరకు వాతావరణ కాలుష్యాన్ని అరికట్టి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఫారెస్ట్ సిబ్బంది సుబ్బారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆటలు అవసరం


గ్రంథాలయంలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు

వల్లూరు : విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా అవసరమని వల్లూరు శాఖా గ్రంథాలయ అధికారిణి వెంకటేశ్వరమ్మ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపులో భాగంగా బుధవారం ఆమె విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, క్యారమ్స్, చెస్ వంటి ఆటలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వారి చేత ఆటలను ఆడించారు. విద్యార్థులకు నీతి కథలను బోధించారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని సీకేదిన్నె గ్రంథాలయ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి ఇబ్రహీం తెలిపారు. బుధవారం సీకేదిన్నె గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, చదరంగం, ఆటలపోటీలు, నీతికథలు వంటి పోటీలను నిర్వహించారు.

స్వచ్ఛ ఎర్రగుంట్లకు సహకరించండి

ఎర్రగుంట్ల : స్థానిక పట్టణ ప్రజలు స్వచ్ఛ ఎర్రగుంట్ల ఏర్పాటుకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మేరా లైఫ్ మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమం ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు తమ ఇంటి నుంచి వచ్చే చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా మున్సిపల్ వాహనంకు అందించాలన్నారు. ప్రతి మహిళకు తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు మెప్మా ఆర్పీలు అవగాహన కల్పించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, మెప్మా సీఓలు విమల, వసంత రెడ్డి. ఆర్పీలు సెక్రటరీలు పాల్గొన్నారు.

రక్షణ చర్యలు పటిష్టం

కడప సిటీ : కడప నగర పరిధిలోని వై జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీ గుంతల నుండి ప్రమాదం జరగకుండా అధికారులు మరింత రక్షణ చర్యలు చేపట్టారు.ప్రస్తుతం ఈ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పనులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో డ్రైనేజీ కాలువలు రోడ్డు భాగంలోకి వచ్చి చేరడంతో వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 'సాక్షి' దినపత్రికలో ఇటీవల వార్త ప్రచురించడంతో మొదటగా ఇనుప స్టాండ్ ఏర్పాటు చేయగా, ఆ తర్వాత వాటికి హెచ్చరిక బోర్డులు పెట్టడంతో వాహనదారులకు ప్రమా దం జరగకుండా చర్యలు చేపట్టినట్లయింది.